సాక్షి ఖమ్మం
గురువారం : 28 : మార్చి : 2024



పని కల్పించండి ప్రభో..

వ్యవసాయ పనులు లేక.. సరిపడా ఉపాధి హామీ పనులు కల్పించక కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 8లో




ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ మాలతి బృందం మూడు ఆస్పత్రులను సీజ్ చేసింది. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.



న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.32.87 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు సమక్షాన కానుకలను లెక్కించగా 91 రోజులకు గాను రూ.32,87,440 ఆదాయం నమోదైంది. ఈకార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, విజయదేవ శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారితో పాటు మధిరకు చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్

వైరా: వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని ఏన్కూరు, కొణిజర్ల మండలాల్లో 1/70 చట్టం అమల్లో ఉన్నా సబ్ రిజిస్ట్రార్ కరుణ అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా రిజిస్ట్రార్ విచారణ చేపట్టినట్లు తెలిసింది. గత ఐదు నెలలుగా స్థానిక డాక్యుమెంట్ రైటర్లు అన్నీ తామై రిజిస్ట్రార్ కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై కూడా అధికారి ఆరా తీసినట్లు సమాచారం.

పండితాపురం సంత వేలం లేనట్లే..



కొమ్మినేపల్లి సంత ముఖద్వారం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల కోడ్ వస్తుందనే ఆలోచనతో అధికారులు ఈనెల 4న, 11వ తేదీన వేలం నిర్వహించినా ప్రభుత్వ మద్దతు ధర రూ.2,40,11,840 రాకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి 18న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అయితే, సంత నిర్వహణ కౌలు కాలపరిమితి ముగియడంతో బాధ్యతలు ఎవరికి అప్పగించాలా అని అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం సంత నిర్వహణ చూస్తున్న కాంట్రాక్టర్‌కే వేలం నిర్వహించే వరకు బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. గతంలోనూ వేలం వాయిదా పడినప్పుడు ఇదే పంథా అవలంబించినందున, ప్రస్తుత కాంట్రాక్టర్‌కే అప్పగించనున్నట్లు సమాచారం.

బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల(బ్యాక్‌లాగ్) భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా వెబ్‌సైట్‌లో సీట్ల వివరాలు సరిచూసుకుని రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 21న పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు.

తాగునీటికి తిప్పలు..

వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఖమ్మం వాసులను వేధిస్తోంది. ఈనెల రెండో వారం నుంచి ఎండలు మండుతుండగా.. భూగర్భ జలాలు పడిపోయాయి. దీంతో చాలాప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడింది. కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటుండగా.. అపార్ట్‌మెంట్ల వాసులు ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



రస్తోగినగర్‌లో 24 గంటల పంపు వద్ద క్యూ



ద్విచక్రవాహనంపై క్యాన్లతో వెళ్తున్న యువకులు



బ్యాంక్ కాలనీలో అపార్ట్‌మెంట్‌కు నీరు తీసుకొచ్చిన ట్యాంకర్

లీకులకు లాక్!



ఇంట్రా విలేజీ పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

'భగీరథ' పైపులైన్లకు చకచకా మరమ్మతులు

- ఎస్‌డీఎఫ్ కింద రూ.5కోట్లు మంజూరు చేసిన కలెక్టర్
- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్న అధికారులు
- తాగునీటి ఇక్కట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు

ఖమ్మంవన్‌టౌన్: ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటుతుండగా.. తరుముకొస్తున్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని మిషన్ భగీరథ పైపులైన్లకు పలుచోట్ల లీకేజీల కారణంగా తాగునీరు వృథా అవుతోంది. అసలే నీటి కొరత ఉన్న నేపథ్యాన ఎక్కడా వృథా కాకుండా అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో మరమ్మతులను యుద్ధప్రతిపాదికన చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పైపులైన్ల లీకేజీల మరమ్మతుల కోసం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఇటీవల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్(ఎస్‌డీఎఫ్) నుండి రూ.5కోట్లు మంజూరు చేశారు. దీంతో లీకేజీ సమస్యకు పరిష్కారం లభించి నీటి సరఫరా సజావుగా జరగనుంది.

శరవేగంగా మరమ్మత్తులు

తాగునీటి సరఫరాకు ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలని ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి ఆదేశించింది. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెనువెంటనే పరిష్కరించి తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో జిల్లా అధికారులు అప్రమత్తమై ప్రధాన సమస్యగా ఉన్న పైపులైన్ల లీకేజీలపై దృష్టి సారించారు. జిల్లాలోని రిజర్వాయర్లు సైతం అడుగంటుతుండడంతో ఏప్రిల్ రెండో వారంలో నాగార్జునసాగర్ నుండి పాలేరు రిజర్వాయర్‌కు నీరు చేరితే తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తొలగుతాయి. ఆలోగా పైప్‌లైన్లకు మరమ్మతులు పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.

వినియోగంలోకి చేతిపంపులు

వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించి అందుకు అనుగుణంగా పనులు పూర్తిచేశారు. జిల్లాలోని 969 గ్రామాల్లో 10,377 చేతిపంపులు ఉండగా అందులో 7,614 వాడుకలో ఉన్నాయి. మిగిలిన 2,763 పనిచేయకపోగా వాటికి సైతం మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా సమస్యను పరిష్కరిస్తున్నారు. తాగునీటి వనరుల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిన చోట.. రైతుల నుంచి వ్యవసాయ బోర్లు, బావులను అద్దెకు తీసుకుని నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

మరమ్మతులు కొనసాగుతున్నాయి



జిల్లాలో పైపులైన్లకు లీకేజీలు ఉన్నచోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేశాం. ఇందుకోసం కలెక్టర్ రూ.5కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. దీంతో మరమ్మతులు చేయించి, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తాగునీటి సమస్య ఎదురుకాకుండా చూస్తున్నాం.

– సదాశివకుమార్, ఎస్‌ఈ, మిషన్ భగీరథ

వసతుల కల్పనలో వేగం : కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఏప్రిల్ 15 నాటికి కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన బడి, ఎస్‌డీఎఫ్ కింద పనులు జరగని 380 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద సౌకర్యాల కల్పన కోసం నిధులు కేటాయించామని తెలిపారు. ఇందులో 542 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. ఎల్‌ఈడీ లైట్లతో పాటు గదికి కనీసం రెండు ఫ్యాన్లు అమర్చాలని, టాయిలెట్లపైనా దృష్టి సారించాలని సూచించారు. కాగా, ఉద్యోగులకు ఎన్నికల విధుల ఉత్తర్వులు గురువారంలోగా అందించి, ఏప్రిల్ 1, 2వ తేదీల్లో జరిగే శిక్షణకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఆతర్వాత ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీలతో సమావేశమైన కలెక్టర్ అక్రమ మార్గాల్లో డబ్బు, మద్యం రవాణా జరగకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ యువరాజ్, డీసీఓ మురళీధర్‌రావు, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్వో రాజేశ్వరి, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, డీఈఓ సోమశేఖరశర్మ, సీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు



సర్టిఫికెట్‌తో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెండోసారి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్.శాస్త్రి బుధవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ఐఎస్ఓ గుర్తింపు రెన్యువల్ సాధించిన రెండో కళాశాలగా నిలిచిందని తెలిపారు. అధ్యాపక బృందం సమష్టిగా కృషి చేయడంతో మంచి ఫలితాలు నమోదవుతుండగా, ఐఎస్ఓ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఈసమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఇందిర, జి.అరుణ, డాక్టర్ పి.సుజాత, డాక్టర్ కె.వీరన్న, షేక్ అఫ్రోజ్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.12 వేల కోట్లతో ఖమ్మం అభివృద్ధి

- యువతకు ఉపాధి కల్పించడమే మా అజెండా
- అయోధ్య నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్
- బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



మాట్లాడుతున్న అభ్యర్థి వినోద్‌రావు, పక్కన జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఖమ్మం జిల్లా అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.12 వేల కోట్లు వెచ్చించింది. ప్రధాని మోదీ నాయకత్వంలో ఖమ్మం చుట్టూ జాతీయ రహదారులు నిర్మాణమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా నాకు అవకాశం ఇస్తే జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకెళ్తుంది' అని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వందల కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమైనందున.. స్థానికుడిని, ఇక్కడి సమస్యలు తెలిసిన తనకు ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. ఖమ్మంలో కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చిన ఓటర్లు ఈసారి తనను గెలిపిస్తే అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని తెలిపారు. మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులతో చర్చించి లోక్‌సభ పరిధిలోని సమస్యలపై విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని యువతకు ఉపాధి కల్పించడమే తమ అజెండాలో ముఖ్యమైన అంశమని, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కలను సాకారం చేయడంతో పాటు అయోధ్య నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ మంజూరు చేయిస్తానని వినోద్‌రావు తెలిపారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, పార్టీ కోసం ప్రాణాలర్పించిన సాయిగణేష్ కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ వినోద్‌రావుకు బీజేపీ టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్‌కు అభ్యర్థి కరువయ్యారని.. ఈ స్థానంలో తమ అభ్యర్థిపూర్తి మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్‌డీఏలో భాగమైనందున వారి మద్దతు సైతం తమకు ఉంటుందని తెలిపారు. అనంతరం ఖమ్మంరూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు శ్యాం రాథోడ్, అల్లిక అంజయ్య, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా కిరణ్, ఉపేందర్, విజయరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో...

మార్కెట్ ఫీజు వసూళ్లలో ముందంజ

- ఖమ్మం జిల్లాలో 96.76 శాతం, భద్రాద్రిలో 84.10 శాతం వసూళ్లు
- సీసీఐ, సివిల్ సప్లయీస్ నుంచి రూ.కోట్లలో బకాయిలు
- అవి కూడా రెండు, మూడు రోజుల్లో జమ అయ్యే అవకాశం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఫీజుల వసూళ్ల లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. వ్యవసాయ మార్కెట్ల పరిధిలో పంటల ఉత్పత్తిని పరిగణనలోకి మార్కెటింగ్ శాఖ లక్ష్యాలను నిర్దేశించింది. ఇందులో ఖమ్మం జిల్లా 93.76 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 84.10 శాతం మేర వసూలు చేయగా... కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), సివిల్ సప్లయీస్ సంస్థలు కొనుగోలు చేసిన పత్తి, ధాన్యం పంటలకు సంబంధించి ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రూ.కోట్లలో ఉన్న ఈ బకాయిలు కూడా వసూలైతే మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యం పూర్తికానుంది.

కొనుగోళ్లపై పన్నులు.. ఒక శాతం ఫీజు

ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లను ఏర్పాటు చేసింది. రెండు జిల్లాల్లో ప్రధాన పంటగా వరితో పాటు వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి కూడా రైతులు సాగు చేస్తున్నారు. ఇక మొక్కజొన్న కూడా యాసంగిలో విస్తారంగా సాగవుతుంది. వీటికి తోడు అపరాల పంటలైన పెసర, కంది, మినుములే కాక ఉద్యాన పంటలైన మామిడి, బొప్పాయి, నిమ్మ, జామ వంటి పంటలను కూడా ఇక్కడ సాగు చేస్తారు. రైతుల నుంచి పంట ఉత్పత్తులను మార్కెట్లు, గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యాపారులు వివిధ రకాల పన్నులతో పాటు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంస్థల ద్వారా కొనుగోలు చేసినా మార్కెట్ ఫీజు చెల్లించేలా నిబంధనలు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం కొంత మేర తగ్గినా మార్కెట్ ఫీజు లక్ష్యాలను చేరుకుంటోంది.

జిల్లాల వారీగా ఇలా...

- ఖమ్మం జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.5,439.72 లక్షలుగా నిర్దేశించగా.. ఇప్పటివరకు రూ.5,100.18 లక్షలు(96.76శాతం) వసూలు చేశారు. ఖమ్మం మార్కెట్ లక్ష్యం అధికంగా ఉండగా 87.09 శాతం వసూలైంది. ఇక కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్లు లక్ష్యాన్ని మించి ఫీజు వసూలు చేశాయి. మద్దులపల్లి మార్కెట్ మాత్రం బాగా వెనకబడింది. గత ఏడాది ఎనిమిది మార్కెట్ల ఫీజు లక్ష్యం రూ.5,436 లక్షలు కాగా రూ.5,722.76 లక్షలు(105.28శాతం) వసూలైన నేపథ్యాన ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈసారి కూడా లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఫీజు లక్ష్యం రూ.1,920.35 లక్షలు కాగా, రూ.1,614.94 లక్షలు వసూలు చేశాయి. ఈ జిల్లాలో బూర్గంపాడు మార్కెట్ ఫీజు లక్ష్యం అధికంగా ఉండగా.. 94.87 శాతం వసూలైంది. దమ్మపేట మార్కెట్ లక్ష్యాన్ని మించి 131.89 శాతంతో జిల్లాలో అగ్రభాగాన నిలిచింది. కొత్తగూడెం, చర్ల మార్కెట్లు మాత్రం లక్ష్యసాధనలో వెనకబడ్డాయి.

మార్కెట్ల వారీగా ఫీజు లక్ష్యం, వసూలైన మొత్తం (రూ.లక్షల్లో)

మార్కెట్	లక్ష్యం	వసూలు	శాతం
సత్తుపల్లి	375.00	462.89	123.44
వైరా	472.01	568.31	120.40
కల్లూరు	417.19	481.05	115.31
ఏన్కూరు	414.12	424.97	102.62
మధిర	434.24	418.78	96.44
ఖమ్మం	2,614.00	2,276.57	87.09
నేలకొండపల్లి	405.16	344.09	84.93
మద్దులపల్లి	308.00	123.52	40.10
మొత్తం	5,439.72	5,100.52	93.76

లక్ష్యాలను చేరుకుంటాం...



మార్కెటింగ్ శాఖ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన మేరకు మార్కెట్ ఫీజు వసూలు చేస్తాం. రెండు జిల్లాల్లో మూడు వ్యవసాయ మార్కెట్లు వెనకబడ్డాయి. దీంతో ఆయా మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. సీసీఐ, సివిల్ సప్లయీస్ నుంచి బకాయిలు వస్తే లక్ష్యాలను చేరుకుంటాం. ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నాం.

– ఎం.ఏ.అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ఆ బకాయిలు కూడా వస్తే...

ఈ ఏడాది పత్తికి బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర లభించకపోవటంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కొనుగోలు చేశారు. ఇక రెండు జిల్లాల్లో వరి ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోళ్లు చేపట్టారు. దీంతో ఈ రెండు శాఖలు కొనుగోలు చేసిన పంటలకు వ్యవసాయ మార్కెట్లకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని మార్కెట్ల పరిధిలో సీసీఐ రూ.3.05 కోట్లు, భద్రాద్రి జిల్లా పరిధిలో రూ.51.06 లక్షలు, పౌర సరఫరాల శాఖ ఖమ్మం జిల్లాలో రూ.8 కోట్లు, భద్రాద్రి జిల్లాలో దాదాపు రూ.3.50 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు కూడా రెండు, మూడు రోజుల్లో కొంత మేరకైనా వ్యవసాయ మార్కెట్లకు జమ అయ్యే అవకాశమున్నందున నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునే అవకాశముందని భావిస్తున్నారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయండి



అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం సూచనల మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాలను చేరుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. 2023–24 ఏడాదికి సంబంధించి సీఎంఆర్‌ను గడువులోగా సేకరించాలని తెలిపారు. అలాగే, వచ్చేనెల 1నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాల్సి ఉన్నందున 223 కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం కావాలన్నారు. కేంద్రాల్లో కావాల్సిన సామగ్రిని సమకూర్చుకుని రైతులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పించాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, డీఎం శ్రీలత, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీసీఓ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

సర్వే పూర్తిచేయాలి

కామేపల్లి: గ్రామపంచాయతీ అభివృద్ధి సూచిక (పీడీఐ) సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తూ సకాలంలో పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ ఆదేశించారు. కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామపంచాయతీని బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరినందున గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్,కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీ.టీ. అసోసియేషన్ నూతన కార్యవర్గం



అసోసియేషన్ నూతన కార్యవర్గమిదే..

ఖమ్మం స్పోర్ట్స్: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శిగా ఓలేటి సాంబమూర్తి, గౌరవ అధ్యక్షులుగా కొండ శ్రీధర్, డాక్టర్ జోన్నలగడ్డ శశికుమార్, రాయల సతీష్‌బాబు ఎన్నికయ్యారు. అలాగే, సీనియర్ ఉపాధ్యక్షులుగా ఎ.శృతి, జంగా కార్తీక్, డాక్టర్ రవి, డాక్టర్ ఎంజీవీ.ప్రవీణ్, పిట్టల కామేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా పి.శ్రావ్య, జోజిచాకో, కోశాధికారిగా పరిటాల చలపతి, కార్యవర్గ సభ్యులుగా రెడ్డిసాయి శివ, భవ్య, ఉపేందర్, రాంచందర్, సయ్యద్ పాషా ఎన్నికైనట్లు వెల్లడించారు. అనంతరం అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్‌లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఖమ్మం వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాట్లు చేస్తామన్నారు. కాగా, ఎన్నికకు సీనియర్ కోచ్ ఎం.డీ.గౌస్, రాష్ట్ర సంఘం తరపున నరసింహారెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు.

కిన్నెరసానిలో ముగిసిన ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలను పర్యవేక్షిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని రెండు స్పోర్ట్స్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపికకు పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడాపాఠశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్నట్లు పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండో రోజు పోటీలకు 46 మంది హాజరుకాగా, ఇందులో 31 మంది బాలికలు, 15 మంది బాలురు ఉన్నారు. ఈ పోటీలను జిల్లా క్రీడాధికారి బొల్లి గోపాల్‌రావు, పర్యవేక్షించగా, పీడీలు, అధికారులు కొమరం వెంకటనారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, నర్సయ్య, రామారావు, మోతీలాల్, కృష్ణ, డి.శిరోమణి, హతీరాం, రవి, ముత్తయ్య, రాంబాబు, నాగరాజు, పార్వతి, మయూరి, బాబూరావు, జె.కృష్ణవేణి, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఖమ్మం నృత్యకారుల ప్రదర్శన



నృత్యప్రదర్శన ఇచ్చిన బాలికలు

ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం పుణ్యక్షేత్రంలో నిర్వహించిన ధర్మపదం కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన మీనా నృత్యాలయం కళాకారులు నృత్యప్రదరన ఇచ్చారు. ఈమేరకు మంగళవారం రాత్రి కళాకారులు ఏలూరి మీనా, శ్వేతవర్షిణి, జనని రఘు, గాయత్రి, రుక్మిక సాయి, భువన చంద్రిక, ఎశ్విత, లక్ష్మీప్రసన్న, బిందుశ్రీ, యోగ్య, గీతిక, చిన్మయి, హిమన్య, ఎశ్వర్దిక, రిత్విక సాయి, నాగనక్షత్ర స్నేహ చంద్ర, సమత ప్రదర్శన ఇవ్వగా, నిర్వాహకులు అభినందించి సన్మానించారు.

స్పాట్ జాబితా సమగ్రంగా రూపొందించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ విధులు కేటాయించే ఉద్యోగుల జాబితా లోటుపాట్లు లేకుండా సమగ్రంగా రూపొందించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, ఎస్.విజయ్ కోరారు. ఈసందర్భంగా బుధవారం వారు డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. అనారోగ్యంతో పాటు బాధపడుతున్న వారితో పాటు ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, మల్లయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,875	6,300
అలసంద	7,400	7,400
మిర్చి	19,900	12,000
మిర్చి తాలు	10,500	5,500
పత్తి	7,400	5,500

– ఖమ్మం వ్యవసాయం

పని కల్పించండి ప్రభో...



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు (ఫైల్)

'ఉపాధి' హామీ కోసం కూలీల ఎదురుచూపులు

- వ్యవసాయ పనులు లేకపోవడంతో పోషణ భారం
- పనుల కల్పనపై క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం
- అధికారుల పర్యవేక్షణ లేమితో నిరుపేదల ఇక్కట్లు

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనుల కల్పనలో జిల్లా యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కూలీలకు పనులు కల్పించలేకపోవడంతో అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగక... గ్రామీణ ప్రాంతాల కూలీలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. ఆర్థిక సంవత్సరం పూర్తి కావొస్తున్నా సరైన స్థాయిలో పనిదినాలను కల్పించలేకపోయారు.

తగ్గుతున్న లక్ష్యం

రాష్ట్రంలోనే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీ పనులు చేసే వారి సంఖ్య జిల్లాలోనే ఎక్కువగా ఉంటుంది. కరోనాకు ముందు జిల్లాలో 90 లక్షలకు పైగా పనిదినాలను పూర్తి చేయగా.. కరోనా సమయంలోనూ 60 లక్షలకు పైగా పనిదినాలను పూర్తయ్యాయి. అయితే గత రెండేళ్లుగా జిల్లాకు కేటాయిస్తున్న పనిదినాల సంఖ్య తగ్గుతోంది. జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఏడాది పనిదినాల సంఖ్య భారీగా తగ్గింది. 2022–23లో ప్రభుత్వం జిల్లాకు 54.42 లక్షల పని దినాలను లక్ష్యంగా నిర్దేశించగా.. 57.8 లక్షల పనిదినాలను కూలీలు వినియోగించుకున్నారు. అయినా ఈ ఏడాది 46.38 లక్షల పనిదినాలనే లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటివరకు 49.13 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. కనీసం 50లక్షల పనిదినాలను పూర్తి చేయగలిగితే వచ్చే ఏడాది ఆ సంఖ్య పెరుగుతుందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పనుల కల్పన అంతంతే..

పని కోసం ఎదురుచూస్తున్న కూలీల సంఖ్య జిల్లాలో భారీగానే ఉంటోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లే కుటుంబాల సంఖ్య అధికారిక లెక్కల ప్రకారం 1.89 లక్షలుగా ఉండగా.. అందులో యాక్టివ్‌గా ఉన్న కూలీలు 3.19 లక్షల మంది ఉన్నారు. ఈ ఏడాది సాగర్‌లో నీళ్లు లేక, వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో కూలీలు ఆసక్తి చూపుతున్నారు. అయితే, క్షేత్ర స్థాయిలో పనులు చూపించకపోవడంతో వారికి మొండిచేయి ఎదురవుతోంది. ప్రస్తుతం రోజుకు 40 వేల మందికి మాత్రమే అధికారుల ఉపాధి చూపించగలుగుతున్నారు. వేసవిలో ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున మార్చి, ఏప్రిల్‌లో వీలైనన్ని పని దినాలు పూర్తి చేసుకోవాలని కూలీలు చూస్తున్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు..	
గ్రామపంచాయతీలు	589
జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.46 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.89 లక్షలు
యాక్టివ్ కూలీలు	3.19
ఈ ఏడాది ఇప్పటి వరకు అయిన ఖర్చు	రూ.166.96 కోట్లు
వేతనాల కింద చెల్లింపులు	రూ.98.56 కోట్లు
సామగ్రి కోసం చెల్లింపులు	రూ.55.45 కోట్లు

గత ఐదేళ్లుగా కల్పించిన పని దినాలు (లక్షల్లో)

ఏడాది	లక్ష్యం	పూర్తి చేసిన పనిదినాలు
2019–20	55	60.04
2020–21	71.05	70.38
2021–22	64	65.63
2022–23	54.42	57.8
2023–24	46.38	49.13



పై ఫొటోలో ఉన్న వారు పని కల్పించాలని కోరేందుకు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చిన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయిపాలెం వాసులు. గ్రామంలో 400మంది వరకు కూలీలు ఉండగా.. నిత్యం పదుల సంఖ్యలో గ్రామపంచాయతీ కార్యాలయానికి వస్తున్నారు. ఏటా ఏప్రిల్ నెలాఖరు వరకు వ్యవసాయ పనులు ఉండేవని.. ఈ ఏడాది వ్యవసాయం సక్రమంగా లేక కూలీ దొరకక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వారు చెబుతున్నారు. కానీ ఈ గ్రామంలో ఉపాధి పనులను గుర్తించకపోవడంతో వారానికి కొందరికి చొప్పున మాత్రమే పనులు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల నమోదు పెరగాలి...



మల్సూర్‌తండా పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

- ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించండి
- తల్లాడ మండలంలో పర్యటించిన కలెక్టర్ గౌతమ్

తల్లాడ: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. తల్లాడ మండలం గొల్లగూడెం, తెలగవరం, అంజనాపురం, మల్సూర్‌తండా, మిట్టపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్యపై ఆరా తీసిన ఆయన వచ్చే విద్యాసంవత్సరంలో పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్సూర్‌తండా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. అలాగే, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన తాగునీరు, విద్యుత్, టాయిలెట్లపై ఆరాతీసి సూచనలు చేశారు. ప్రహరీలు లేనిచోటవెంటనే నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అలాగే, మండలంలోని మిట్టపల్లిలో పల్లె దవాఖానాను తనిఖీ చేసిన కలెక్టర్.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, విద్యాశాఖ ఈఈ నాగశేషు, తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి, ఇరిగేషన్ డీఈ శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

లింక్ కెనాల్ భూసేకరణపై అధికారుల భేటీ



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ కాశయ్య

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు నీటిని ఏన్కూరు మండలంలోని సాగర్ కాల్వలోకి, అపై వైరా రిజర్వాయర్‌లోకి మళ్లించేందుకు లింకు కెనాల్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందు కోసం భూమి సేకరించాల్సి ఉండగా.. జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినోభానగర్, జూలూరుపాడు గ్రామాల రైతులతో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) కాశయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నీటిని ఏన్కూరు మండలంలోని సాగర్ కెనాల్‌కు అనుసంధానం చేసేలా కాల్వ నిర్మించనుండగా, 50 ఎకరాల భూమి ప్రభుత్వం సేకరించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు సర్వేను అడ్డుకోవడానికి కారణాలపై ఆరా తీసిన ఆయన రైతులు సహకరించాలని కోరారు. అయితే, విలువైన వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తుండటమే కాక బోర్లు కూడా ఉన్నాయని రైతులు చెప్పారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం తక్కువగా ఉన్నందున ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలని కోరడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌డీసీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, గిర్దావర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకపోతే చర్యలు తప్పవు



ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను ఉన్నవారు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. ఖమ్మంలోని శ్రీనివాసనగర్, ముస్తఫానగర్ ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన బకాయిదారులతో మాట్లాడారు. పన్ను చెల్లించకుంటే నల్లా కనెక్షన్లు తొలగించడమే కాక మున్సిపల్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, బకాయి ఎక్కువగా ఉన్న వారిపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. నగరంలోని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆయన సౌకర్యాల కల్పనపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ప్రతీ కేంద్రం ప్రహరీపై ఓటరు అవగాహన నినాదాలు రాయించాలని తెలిపారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి నుంచి విశాఖకు బస్సులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజూ విశాఖపట్నానికి లహరి నాన్ ఏసీ బస్సులతో పాటు ఖమ్మంకు త్రీ స్టాప్ డీలక్స్ సర్వీసులను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.రామారావు తెలిపారు. ఖమ్మంకు త్రీస్టాప్ బస్సులు ప్రతిరోజు ఉదయం 6, 7, 9.30, 10.30, మధ్యాహ్నం 1.30, 2.30, సాయంత్రం 5, 6 గంటలకు బయలుదేరుతాయని చెప్పారు. విశాఖపట్నానికి లహరి బస్సులు ఉదయం, రాత్రి 9 గంటలకు, విశాఖపట్నం నుంచి ఉదయం 8, రాత్రి 8.45 గంటలకు బయలు దేరుతాయని డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ తనిఖీ

నిబంధనలు పాటించని మూడు దవాఖానాల సీజ్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ మాలతి



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి ఆధ్వర్యాన బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో తనిఖీ చేశారు. వైరారోడ్డులోని ఆదిత్య ఆస్పత్రిలో అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు అందిన ఫిర్యాదుతో రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి అబార్షన్లు నిర్వహిస్తుండగా గుర్తించి యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ సీజ్ చేశారు. అదే కాంప్లెక్స్‌లోని తులసి డెంటల్ ఆస్పత్రి, పాజిటివ్ హోమియో కేర్ ఆస్పత్రులను సైతం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలు తుంగలో తొక్కి నిర్వహిస్తున్నట్లు తేలడంతో ఈ ఆస్పత్రులను సీజ్ చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డెమో కాశీనాథ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి రూ.4.30 లక్షలు స్వాధీనం

మిర్చి అమ్మి వస్తుండగా చెక్‌పోస్టులో సీజ్



నగదుతో రైతులు, పక్కన స్క్వాడ్ అధికారులు

ఇల్లెందు: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను ఖమ్మం మార్కెట్‌లో అమ్మి వస్తున్న రైతుల నుంచి రూ.4.30 లక్షల నగదును ఎన్నికల చెక్ పోస్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు కల్తీ సత్యనారాయణ, మంగయ్య బుధవారం ఖమ్మంలో మిర్చి అమ్మి రూ.4.30 లక్షలతో స్వగ్రామానికి బొలేరో వాహనంలో బయలుదేరారు. ఈ సందర్భంగా ఇల్లెందు మండలం రొంపేడులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారులు కుమారస్వామి, అబ్దుల్ ఘనీ వీరి నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేల కంటే నగదు తీసుకెళ్లొద్దని తెలిపారు. అయితే, తాము పంట అమ్మిన డబ్బు తీసుకెళ్తున్నామని రైతులు చెప్పినా ససేమిరా అన్న అధికారులు.. తగిన ఆధారాలను కలెక్టరేట్‌లో సమర్పించి నగదు తీసుకోవాలని సూచించారు.

చిన్నారి కడుపులో వెంట్రుకల ఉండ..

జీర్ణాశయానికి అడ్డు పడడంతో తొలగింపు



బాలిక కడుపు నుంచి తీసిన వెంట్రుకలు



కోలుకుంటున్న బాలికతో ఆస్పత్రి వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన 11 ఏళ్ల బాలిక కడుపులో వెంట్రుకలు ఉండ కట్టుకోగా.. జీర్ణాశయానికి అడ్డుపడడంతో శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. వివరాలిలా ఉన్నాయి... బాలిక శరణి కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండడంతో ఆమె తల్లిదండ్రులు ఖమ్మంలోని పల్స్ ఆస్పత్రికి తీసుకురాగా డాక్టర్ అన్వర్ పరీక్షించారు. అప్పుడప్పుడు ఆమె వెంట్రుకలు నోట్లో పెట్టుకుని నమలడాన్ని చూశామని తల్లిదండ్రులు చెప్పడంతో పరీక్షలు చేయగా జీర్ణకోశంలో వెంట్రుకల ఉండ కట్టుకుని అడ్డు పడ్డాయని తేలింది. దీంతో మరో వైద్యుడు ఆనంద్‌గౌడ్‌తో కలిసి పాపకు బుధవారం ఆపరేషన్ చేసి దాదాపు 25 సెంటీమీటర్ల పొడవు, 10 సెంటీమీటర్ల వెడల్పుతో ఉన్న వెంట్రుకల ఉండ బయటకు తీశారు. ప్రస్తుతం పాప ఆరోగ్యంగా ఉండగా... వెంట్రుకలు తినే అలవాటును 'ట్రైకోఫేజియా'గా పిలుస్తారని, మానసిక సమస్యల కారణంగా ఇది ఎదురవుతుందని డాక్టర్ అన్వర్ తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు



బ్యాంకు అధికారులకు నగదు అందచేస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 26 రోజులకు గాను రూ.74,79,341 ఆదాయం సమకూరిందని ఈఓ రమాదేవి తెలిపారు. ఇందులో హుండీల ద్వారా రూ.71,22,878, గోశాలకు రూ.1,95,363, అన్నదానానికి విరాళంగా రూ.1,61,100 వచ్చినట్లు వెల్లడించారు. కాగా, హుండీల్లో విదేశీ కరెన్సీ కూడా లభించిందని తెలిపారు. ఆలయ ఏఈఓ భవానీరామకృష్ణ, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మధిరరూరల్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మధిర మండలం మహదేవపురం ప్రభుత్వ పాఠశాలను బుధవారం తనిఖీ చేసిన ఆయన ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు అమర్చాలని, తాగునీరు, టాయిలెట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని చెప్పారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

149 కేసులు..రూ.13,92,213 సొత్తు స్వాధీనం

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి మంగళవారం వరకు 181 మందిపై 149 కేసులు నమోదు చేయగా.. రూ.13,92,213.50 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వ్యయ పరిశీలన సెల్ నోడల్ అధికారి మురళీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50,400 విలువైన పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని ఒక కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇక పోలీస్ శాఖకు సంబంధించి 58మందిపై 26 కేసులు నమోదు కాగా రూ.1.89లక్షల విలువ, ఎక్సైజ్ శాఖకు సంబంధించి 123మందిపై కేసులు నమోదు చేసి రూ.12,03,213.50విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బోనకల్ చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్‌పోస్ట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

బోనకల్: మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆర్డీఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గణేష్ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించిన ఆయన మాట్లాడుతే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఉద్యోగులకు సూచించారు. తహసీల్దార్ పున్నంచందర్, ఆర్ఐ అక్మల్ పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీలు సీజ్

సత్తుపలిటౌన్: రాజమండ్రి నుంచి సత్తుపల్లికి అక్రమంగా ఇసుక తీసుకొస్తున్న మూడు లారీలను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక రావడంతో పాటు అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నట్లు తేలగా లారీలను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి సీఐ టి.కిరణ్ తెలిపారు.

ఇద్దరిపై హత్య కేసు నమోదు

కారేపల్లి: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఓ వ్యక్తిపై పురుగుల మందుతో దాడి చేయగా చికిత్స పొందుతూ ఆయన మృతి చెందిన నేపథ్యాన ఇద్దరిపై హత్య కేసు నమోదు చేసినట్లు కారేపల్లి పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలోని మంగళితండాకు చెందిన విశ్రాంత ఉద్యోగి ధారావత్ పాండ్యా(65)తో పాతకక్షలు ఉండడంతో ధరావత్ పింప్లి, ఆమె కొడుకు ధరావత్ వీరబాబు ఇంటి గెట్టుపై ఉన్న వేపచెట్టు ఆకులు రాలాయంటూ కొద్దిరోజుల క్రితం గొడవ పడ్డారు. ఈక్రమంలో పాండ్యాపై పురుగుల మందు చల్లగా ఆయన నోట్లోకి వెళ్లడంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడి ఫిర్యాదుతో గతంలోనే వీరబాబును రిమాండ్‌కు తరలించగా ప్రస్తుతం హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చినట్లు సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు.